షణ్ముఖ SHANMUKHAVELUGU APTEL 16448

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక

సంపుటి : 1 సంచిక : 221 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ ఆదివారం 23 జూన్ 2024 పేజీలు 8 : వెల 3/- ఒంగోలు

VOLUME : 01 ISSUE : 221 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE June 23, 2024 PAGES : 8 PRICE : 3/-

## పులివెందులలో జగన్‌కు ఘనంగా స్వాగతించిన స్థానిక నేతలు

కడప,జూన్22(షణ్ముఖవెలుగు): ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పులివెందుల బయలుదేరారు. ఆయనకు స్థాకి నేతలు, వైసిపి కార్యాకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. పులివెందుల పర్యటనకు వెళ్లగా రాయలసీమ నేతలు వచ్చి స్వాగతం చెప్పారు. ఎన్నికల ఫలితాల తర్వాత తొలిసారి ఆయన పులివెందులకు వెళ్లారు. అయితే.. వైఎస్ జగన్ నివాసం వద్ద తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. మాజీ సీఎంను చూసేందుకు పెద్ద ఎత్తున నియోజకవర్గ కార్యకర్తలు, నేతలు విచ్చేశారు. అయితే.. జగన్‌ను కలవడానికి చాలా మంది కార్యకర్తలు ప్రయత్నించగా వ్యక్తిగత సిబ్బంది, సెక్యూరిటీ అడ్డుకుంది.



## పేపర్ లీక్‌చేస్తే 5నుంచి పదేళ్ల జైలు

### కోటివరకు జరిమానా విధింపు

అమల్లోకి వచ్చిన ప్రివెన్షన్ యాక్ట్

నీట్ రద్దుతో విద్యార్థులకు నష్టం

కొందరి వల్ల లక్షలాది మందికి కష్టం

విద్యాశాఖ మంత్రి ధర్మేందర ప్రధాన్

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్

తరచూ పేపర్ల లీకేజీతో కేంద్రం దిద్దుబాటు

పరీక్షల నిర్వహణ ప్రక్రియలో సంస్కరణలు

ఇస్రో మాజీచైర్మన్ రాధాకృష్ణన్ కమిటీ ఏర్పాటు



న్యూఢిల్లీ,జూన్22(షణ్ముఖవెలుగు): దేశంలో వరుస పేపర్ లీకులతో సతమవుతున్న కేంద్రం ప్రభుత్వం యాక్షన్ ప్లాన్ మొదలుపెట్టింది. పేపరు లీకేజీలకు కారణమైన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకునేందుకుగాను యుద్ధప్రాతిపదికన 'ది పబ్లిక్ ఎగ్జామినేషన్స్(ప్రివెన్షన్ ఆఫ్ అన్ ఫెయిర్ మీన్స్)యాక్ట్-2024ను అమల్లోకి తీసుకొచ్చింది. ఇది జూన్ 21 నుంచి అమల్లోకి వచ్చినట్లు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందుకు సంబంధించి న్యాయశాఖ నిబంధనలు రూపొందిస్తోందని, త్వరలో నోటిఫై చేస్తామని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన ఆ వ్యాఖ్యలు చేసిన 24 గంటల్లోపే కేంద్ర సిబ్బంది, వ్యవహారాలశాఖ ఈ చట్టాన్ని అమల్లోకి తెస్తూ నోటిఫికేషన్ జారీ చేసింది. దీని ప్రకారం ఎవరైనా చట్టవిరుద్ధంగా పరీక్ష పేపర్లను మిగతా 2లో..

## రాజధాని అమరావతికి వైద్యవిద్యార్థి విరాళం

పొలం అమ్మి 25 లక్షలు అందించిన వైష్ణవి

పోలవరానికి మరో లక్ష విరాళం అందచేత

వైష్ణవి ఉదారతను అబినందించిన సిఎం చంద్రబాబు

అమరావతికి బ్రాండ్ అంబాసిడర్‌గా నియమిస్తూ ఆదేశాలు



అమరావతి,జూన్22(షణ్ముఖవెలుగు): రాజధాని అమరావతికి రూ.25 లక్షల విరాళం ఇచ్చిన వైద్య విద్యార్థిని అంబుల వైష్ణవిని సిఎం చంద్రబాబు అబినందించారు. పొలం అమ్మి రాజధానికి విరాళం ఇచ్చిన వైష్టవి స్ఫూర్తిని అభినందించిన సీఎం మిగతా 2లో..

## మీ అనుభవంతో సభకు హుందాతనం

మంచి నిర్ణయాలు తీసుకునే సత్తా మీకుంది

అందరిపాత్రుడు ఆయన

అంటూ..లోకేశ్ అభినందన



అమరావతి,జూన్22(షణ్ముఖవెలుగు): ఎప్పుడూ ప్రజల గురించి ఆలోచించే వ్యక్తి అయ్యన్న. ఏడుసార్లు ఎమ్మెల్యేగా మీకు చాలా అనుభవం ఉంది. మీ మిగతా 2లో..



## అయ్యన్న ఎంపికతో సభకు హుందాతనం

### సుదీర్ఘ రాజకీయ అనుభవంతో ప్రత్యేక ముద్ర

గౌరవసభగా ఇక మంచి నిర్ణయాలకు ఆస్కారం

రాజధాని, పోలవరం, నదుల అనుసంధానం జరగాలి

అయ్యన్న నేతృత్వంలో సభలో మంచి నిర్ణయాలు తీసుకోవాలి

స్పీకర్‌ను అభినందిస్తూ సిఎం చంద్రబాబు ప్రసంగం

రాష్ట్ర ప్రజలు మీ హుందాతనం చూస్తారు


ఈ ఐదేళ్లు.. వచ్చే భిష్యత్‌కు పునాది కావాలి

అయ్యన్నను అభినందిస్తూ ప్రసగించిన పవన్

స్పీకర్‌గా అయ్యన్న పాత్రుడు ఎన్నిక

స్పీకర్ స్థానంలో కూర్చోబెట్టిన సిఎం, డిప్యూటి సిఎం

అమరావతి,జూన్22(షణ్ముఖవెలుగు): ఎపి శాసనభ సమావేశాలు రెండోరోజు శనివారం స్పీకర్ ఎన్నికతో ప్రారంభం అయ్యాయి. స్పీకర్‌గా అయ్యన్న పాత్రుడి ఎన్నికను సభ్యులు అభినందించారు. ఆయన స్పీకర్‌గా ఇక సభను హుందాగా నడిపించాలని, గౌరవసభ ముందుకు తీసుకుని వెళ్లాలని ఆకాంక్షించారు. ఈ క్రమంలో సిఎం చంద్రబాబు తొలుత మాట్లాడుతూ...అసెంబ్లీలో అత్యంత సీనియర్ సభ్యుల్లో అయ్యన్న పాత్రుడు ఒకరని అన్నారు. స్పీకర్‌గా అయ్యన్న ఎన్నిక అనంతరం ఆయన మాట్లాడారు. అందరి ఆమోదంతో మిగతా 2లో..



## శ్రీవారి ప్రత్యేక దర్శనం, లడ్డూ ధరలు యధాతథం

వాటిలో ఎలాంటి మార్పూలేదని టిటిడి వివరణ

సోసల్ మీడియా ప్రచారంలో వాస్తవంలేదని వెల్లడి

తిరుమల,జూన్22(షణ్ముఖవెలుగు): శ్రీవారి ప్రత్యేక ప్రవేశ దర్శనం, లడ్డూ ధరలను సవరించినట్లు పలు సామాజిక మాధ్యమాల్లో జరుగుతన్న ప్రచారంలో నిజం లేదని టిటిడి తెలిపింది. ఇవి నమ్మదగినివి కాదని పేర్కొంది. దీనిపై తిరుమల తిరుపతి మిగతా 2లో..



## ఎపిలో ఛానళ్లపై నిషేధం ఎత్తివేత

అసెంబ్లీలో ఛానళ్ల ప్రవేశంపై నిషేధం ఎత్తేస్తూ స్పీకర్ ఆదేశాలు

అమరావతి,జూన్22(షణ్ముఖవెలుగు): అక్రమాలను, అరాచకాలను ప్రశ్నిస్తున్నారనే అక్కసుతో ఏబీఎన్-ఆంధ్రజ్యోతి తదితర ఛానళ్లపై గత వైసిపి ప్రభుత్వం విధించిన నిషేధాన్ని.. కొత్త ప్రభుత్వం తొలగించింది.మూడు ఛానల్స్‌పై గత అసెంబ్లీ విధించిన నిషేధాన్ని స్పీకర్ అయ్యన్న పాత్రుడు తొలగించారు. ఇందుకు సంబంధించిన ఫైల్‌పైనే అయ్యన్న తొలి సంతకం చేశారు. అసెంబ్లీలో స్పీకర్ ఛాంబర్‌లో పూజలు నిర్వహించిన అయ్యన్నపాత్రుడు సభాపతిగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం తొలి సంతకం.. ఆయా ఛానల్స్‌పై విధించిన నిషేధాన్ని మిగతా 2లో..



## పోలవరం నిర్మాణాన్ని సవాల్‌గా తీసుకోవాలి

నిర్వాసితులను ఆదుకోవడంలో ముందుండాలి

చంద్రబాబుకు ప్రతిష్టాకంగా మారిన నిర్మాణం

పోలవరం జాతీయ ప్రాజెక్ట్. దీనిని పూర్తి చేయాల్సిన బాధ్యత కేంద్రానిది. అలాగే సకాలంలో నిధులు విడుదల చేసి పూర్తి చయాల్సి ఉంది. విభజన జరిగి 10 ఏళ్లు పూర్తయ్యింది. అయినా సమస్యలు ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా ఉన్నాయి. సిఎంగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టగానే గత సోమవారం పోలవరం సందర్శించి పనుల పురోగతిని తెలుసుకున్నారు. ఇందులో ప్రధానంగా ప్రాజెక్టును పూర్తిచేయడంతో పాటు, అంతే చిత్తశుద్ధితో పునరావాస చర్యలు తీసుకోవాలి. భూములు, ఇళ్లు కోల్పోయిన వారికి గౌరవప్రదంగా పునరావాసం కల్పించాలి.

ఏలూరు,జూన్22(షణ్ముఖవెలుగు): పోలవరం నిర్వాసితులను ఆదుకోవడంలో గత ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యింది. ఈ క్రమంలో పోలవరం పోరుకేక చేపట్టి సమస్యలను ప్రబుత్వాల దృష్టికి తేవడంలో లెఫ్ట్ పార్టీలు బాగా కృషి చేశాయి. పోలవరం నిర్వాసితుల సమస్యలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు కృషి చేశారు. పోలవరం పోరుకేక నిర్వాసితుల్లో కొంత భరోసా కల్పించింది. పోలవరం అవకతవకలు లేదా నిధుల దుర్వినియోగం ఉంటే ఎపి ప్రభుత్వాన్ని నిలదీయవచ్చు. నిధుల దుబారాను అరికట్టవచ్చు. కానీ పోలవరం సందర్శించడం కూడా నేరంగా పరిగణించి దానిని జరుపకూడదన్న రీతిలో గత వైసిపి ప్రభుత్వం చంద్రబాబుపై ఆంక్షలు పెట్టడం అబివృద్ధిని మిగతా 2లో..

## ఆర్థిక సవాళ్లను అధిగమించాలంటే కేంద్రం సహకరించాలి

పోలవరం, అమరావతి నిర్మాణాలకు తోడ్పాటు ఇవ్వాలి

పారిశ్రామిక రాయితీలు, పారిశ్రమిక కారిడార్ల ఏర్పాటుకు తోడ్పడాలి

ఆక్వా పార్కులు, టెక్స్ టైల్ పార్కులు, గ్రీన్ ఎనర్జీ కారిడార్‌కు మద్దతు

ప్రీ బడ్జెట్ సమావేశంలో సమస్యలను ఏకరువు పెట్టిన ఎపి ఆర్థికమంత్రి పయ్యావుల



న్యూఢిల్లీ,జూన్22(షణ్ముఖవెలుగు): విభజన వల్ల వచ్చిన ఆర్థిక సవాళ్లను అధిగమించడానికి, గడిచిన 5 ఏళ్లలో ఆర్థిక పరమైన తప్పులను సరిదిద్దాడానికి కేంద్ర సహకారం కావాలని కోరానని ఏపీ రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. రాష్ట్రానికి ఏం కావాలి మిగతా 2లో..

## అక్రమంగా వైసిపి కార్యాయల నిర్మాణం

### అనుమతి లేదంటూ సిఆర్‌డిఎ కూల్చివేత

విశాఖలో అనుమతి లేకుండా వైకాపా కార్యాలయం

నోటీసులు ఇచ్చిన మున్సిపల్ కార్పోరేషన్

ఎపిలో బుల్‌డోజ్ రాజకీయాలు

కార్యాలయ కూల్చివేతపై జగన్ మండిపాటు

కూల్చిన ప్రాంతాన్ని పరిశీలించిన అంబటి



అమరావతి,జూన్22(షణ్ముఖవెలుగు): గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం సీతాన గరంలో వైకాపా కార్యాలయం కోసం అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మిస్తున్న భవనాన్ని అధికారులు కూల్చివేశారు. నీటి పారుదల శాఖ స్థలంలో పార్టీ కార్యాలయం నిర్మాణాన్ని చేపట్టారు. బోట్ యార్డుగా ఉపయోగిస్తున్న స్థలాన్ని తక్కువ లీజుతో వైకాపా మిగతా 2లో..

## రోడ్డుపైనే జనసేనాని ప్రజా దర్బార్

ప్రజల వినతులకు తక్షణ పరిష్కారం

అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఆదేశాలు

డిప్యూటి సిఎం పవన్ చొరవతో ప్రజల ఆనందం

గుంటూరు,జూన్22(షణ్ముఖవెలుగు): గుంటూరు జిల్లా మంగళగిరిలోని జనసేన కేంద్ర కార్యాలయం వద్ద రోడ్డుపైనే డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రజాదర్బార్ నిర్వహించారు. తాజాగా ఉప ముఖ్యమంత్రి గా పవన్ కల్యాణ్ బాధ్యతలు చేపట్టడం అటు అసెంబ్లీ సమావేశాల్లోనూ ఆయన పాల్గొనడంతో సమస్యలు చెప్పుకునేందుకు ప్రజలు జనసేన కార్యాలయానికి బారులు తీరుతున్నారు. జనసేన కార్యాలయానికి అప్పుడే వచ్చిన డిప్యూటీ సీఎం.. కారు నుంచి దిగి రోడ్డుపైనే కుర్చీలు వేయించి వారితో మాట్లాడారు. సమస్యలు విన్న మిగతా 2లో..



షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
ప్రకాశం

# 40,336 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు



- దస్త్రం పై మంత్రి గొట్టిపాటి తొలి సంతకం
- ప్రభుత్వ కార్యాలయాలకు దశల వారీగా సోలార్ విద్యుత్ కనెక్షన్లకు రెండో సంతకం
- ఇంటింటికి 3 కిలోవాట్ల సోలార్ విద్యుత్ అందించేందుకు మూడో సంతకం
- రాష్ట్రంలో విద్యుత్ డిమాండు సరఫరాపై ప్రత్యేక దృష్టి సారిస్తాం
- దేశంలోనే ఆదర్శవంతమైన విద్యుత్‌శాఖగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దుతాం
- విద్యుత్ సంస్కరణలకు ఆద్యుడు సిఎం చంద్రబాబునాయుడు
- రాష్ట్ర ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

4

# ప్రకాశం జిల్లా కలెక్టర్‌గా తమీమ్ అన్సారియా



(షణ్ముఖ వెలుగు బ్యూరో, ప్రకాశం, జూన్ 22)


ప్రకాశం జిల్లా కలెక్టర్‌గా తమీమ్ అన్సారియా ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ నీరబ్ కుమార్ ప్రసాద్ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 18 మంది ఐఏఎస్ స్థాయి అధికారులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు. ఆ ఉత్తర్వుల్లో భాగంగా ఇప్పటి వరకు ప్రకాశం జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు నిర్వర్తించిన ఏ ఎస్ దినేష్‌కుమార్‌ను అలూరి సీత రామరాజు జిల్లా కలెక్టర్‌గా బదిలీ చేశారు. శ్రీకాకుళం జిల్లా మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్‌గా పని చేస్తున్న తమీమ్ అన్సారియాను ప్రకాశం జిల్లా కలెక్టర్‌గా నియమించారు. ఈమె 2015 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందినది. త్వరలోనే ఆమె జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకోనున్నారు.

# శ్రీవారి ప్రత్యేక ప్రవేశ దర్శనం, లడ్డూ ధరల్లో ఎటువంటి మార్పు లేదు

***టీటీడీ ధరలను సవరించిందని పలు సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తలు అవాస్తవం***

***తిరుమల శ్రీవారి రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం, రూ. 50 లడ్డూ ప్రసాదం ధరల్లో ఎటువంటి మార్పు లేదని టీటీడీ స్పష్టం చేసింది***

***పలు సామాజిక మాధ్యమాలలో శ్రీవారి లడ్డు ధరలు, ప్రత్యేక ప్రవేశ దర్శనం కొరకు దళారులను సంప్రదించొద్దు భక్తులకు టీటీడీ విజ్ఞప్తి***



(షణ్ముఖ వెలుగు బ్యూరో, తిరుపతి, జూన్ 22)

శనివారం కొన్ని వాట్స్‌అప్ గ్రూపులలో తిరుమల దర్శనానికి సంబంధించి అధిక ధరలకు ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు పొంద వచ్చునని, తిరుమల శ్రీవారి రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం రేటు తగ్గిందని, రూ.50 లడ్డు ధరలు తగ్గించారని కొంతమంది వారి ఫోన్ నంబర్లతో కూడిన తప్పుడు సమాచారం సర్కులేట్ చేశారు. వాస్తవానికి శ్రీవారి ప్రత్యేక ప్రవేశ దర్శనానికి సంబంధించి టీటీడీ వెబ్సైట్ ద్వారానే కాకుండా వివిధ రాష్ట్రాలకు సంబంధించిన టూరిజం విభాగాలకు కొంత టికెట్ల కేటాయింపు జరిగిందన్నారు. భక్తులు ఎవరైనా సంబంధిత టూరిజం ద్వారా ఈ టిక్కెట్లను పొందే సౌకర్యం ఉన్నది. టూరిజం ద్వారా రావాలి అనుకొనే భక్తులు, దళారీల ద్వారా కాకుండా నేరుగా రాష్ట్ర టూరిజం వెబ్సైట్ ద్వారా కూడా దర్శనం ప్యాకేజీ టికెట్స్ పొందే అవకాశం ఉందని, భక్తులు గమనించాలని టిటిడి ఈఓ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. అయితే కొందరు దళారులు అమాయకులను తాము సదరు టూరిజం వెబ్సైట్ ద్వారా మీకు టిక్కెట్లు బుక్ చేసి ఇస్తామని, ఇందుకు గాను ధర ఎక్కువ అవుతుందని పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్ల బుకింగ్‌లో అమాయకులైన భక్తులను మోసగిస్తున్న దళారులపై టిటిడి విజిలెన్స్ విభాగం కఠిన చర్యలు తీసుకుంటుందని తెలియజేశారు. అంతే కాకుండా ఇటువంటి దళారుల మాట నమ్మి మోసపోవద్దని భక్తులకు విజ్ఞప్తి చేశారు. స్వామి వారి ప్రత్యేక ప్రవేశ దర్శనం రూ.300 తగ్గలేదని, లడ్డు ధర కూడా రూ.50 ను తగ్గించలేదని ఆయన స్పష్టం చేశారు.

# ఒంగోలు అభివృద్ధి ప్రదాత

## ఎమ్మెల్యే దామచర్లకు ఘన స్వాగతం పలికిన టిడిపి శ్రేణులు





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 22)

అడుగడుగునా మహిళల నీరాజనాలు అసెంబ్లీలో ఒంగోలు ఎమ్మెల్యేగా ప్రమాణం చేసిన తరువాత తొలిసారి ఒంగోలు నగరానికి వచ్చిన దామచర్ల జనార్ధన్‌రావుకి శనివారం సాయంత్రం పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఒంగోలు నగరానికి చేరుకున్న ఎమ్మెల్యే దామచర్లకు స్థానిక కర్నూలు రోడ్డు బైపాస్ వద్ద తెలుగు మహిళలు దామచర్లపై పూల వర్షం కరిపించారు. ఓపెన్ టాప్ జీపుపై ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు, జనసేన పార్టీ ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్ నిలబడి ప్రజలకు అభివాదం చేసే ముందుకు సాగారు. కర్నూల్ రోడ్డు సబ్ స్టేషన్ వద్ద టిడిపి అభిమానులు గుమ్మడి కాయలతో దిష్టి తీసి హారతులిచ్చి స్వాగతం పలికారు. (తరువాయి 4లో...)

# విద్యుత్‌శాఖ మంత్రికి అభినందనలు



(షణ్ముఖ వెలుగు, అమరావతి, జూన్ 22)

సచివాలయంలో విద్యుత్‌శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన గొట్టిపాటి రవికుమార్‌ని పలువురు టీడీపీ ప్రకాశం జిల్లా ఎమ్మెల్యేలు, ఒంగోలు ఎంపి మర్యాదపూర్వకంగా కలిసి బొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధన్‌రావు, కందుల నారాయణరెడ్డి, ముత్తుమల అశోక్‌రెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, కందుకూరు మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు, (తరువాయి 4లో...)

# ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఒంగోలు ఎంపి మాగుంట

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 22)



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్‌ను శనివారం సచివాలయంలో ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులరెడ్డి



మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపి మాగుంటతో పాటు ఆయన పిఏ రామకృష్ణ, తదితరులు ఉన్నారు.

# 40,336 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు



**(షణ్ముఖ వెలుగు, అమరావతి, జూన్ 22)**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కొత్తగా 40వేల 336 వ్యవసాయ విద్యుత్ కనక్షన్లు మంజూరు చేస్తూ రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ దస్త్రం పై తొలి సంతకం చేశారు. ఈ మేరకు శనివారం అమరావతి రాష్ట్ర సచివాలయంలో ఆయన వేద పండితుల ఆశీర్వచనాల మధ్య ఇంధనశాఖ మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా 40వేల 336 కొత్త వ్యవసాయ విద్యుత్ కనక్షన్లు మంజూరు చేస్తూ దస్త్రంపై తొలి సంతకం చేశారు. అలాగే ప్రభుత్వ కార్యాలయాలకు దశలవారీగా సోలార్ విద్యుత్ కనెక్షన్ల మంజూరుకు సంబంధించిన దస్త్రంపై రెండో సంతకం చేశారు. అదే విధంగా ప్రధానమంత్రి సూర్యఘర్ పథకంలో ఇంటింటికి మూడు కిలోవాట్ల సోలార్ విద్యుత్ అందించే కార్యక్రమానికి సంబంధించిన దస్త్రంపై మూడో సంతకం చేశారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ తనకు విద్యుత్‌శాఖ మంత్రిగా అవకాశం కల్పించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రజలకు మెరుగైన రీతిలో విద్యుత్‌ను అందించేందుకు విద్యుత్ సరఫరా డిమాండ్ల పై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని స్పష్టం చేశారు. దేశంలో విద్యుత్ సంస్కరణలకు ఆద్యుడు చంద్రబాబు నాయుడని, ఆయన తీసుకు వచ్చినన్ని విద్యుత్ సంస్కరణలు మరెవరూ తీసుకురాలేదని అన్నారు. దేశంలోనే ఉత్తమ విద్యుత్‌శాఖగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ శాఖను తీర్చిదిద్దేందుకు అన్ని విధాలా ప్రయత్నం చేస్తానని మంత్రి పేర్కొన్నారు. విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి విద్యుత్ శాఖ ద్వారా ప్రజలకు మెరుగైన రీతిలో సేవలు అందించే విధంగా పనిచేయాలని మంత్రి రవికుమార్ ఆకాంక్షించారు. గత ప్రభుత్వం విద్యుత్ శాఖను నిర్వీర్యం చేయడమే గాక 9 సార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై మోయలేని భారం మోపిందని ఆరోపించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతో చర్చించి అవసరాన్ని బట్టి విద్యుత్ చార్జీల పెంపుదల పై నిర్ణయం తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్, బాపట్ల ఎమ్మెల్యే వి నరేంద్ర వర్మ, పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, పలువురు, ఇతర ప్రజా ప్రతినిధులు, ఇంధనశాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అమరావతి రైతులతో నారాయణ

## భవిష్యత్ ప్రణాళికపై మంత్రి పొంగూరు నారాయణతో చర్చించిన రైతులు

## మళ్లీ మీరే మంత్రిగా రావడం మా అదృష్టం సార్ అన్న రైతులు

**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జూన్ 22)**



విజయవాడలోని అమరావతి రైతులతో సీఆర్‌డీఏ కార్యాలయంలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ రాజధాని రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా భవిష్యత్ ప్రణాళిక పై మంత్రి నారాయణతో రైతులు సుదీర్ఘంగా చర్చించారు. మళ్లీ మీరే మంత్రిగా ఇదే శాఖకు రావడం మా అదృష్టంగా భావిస్తున్నామని నారాయణతో రైతులు అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతో మాట్లాడి రైతులందరికీ న్యాయం చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం మంత్రి నారాయణను రైతులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డితో పాటు పలువురు రైతులు, అధికారులు పాల్గొన్నారు.

# 24 నుంచి మీ కోసం

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 22)**

ఈ నెల 24వ తేదీ సోమవారం నుంచి మీ కోసం కార్యక్రమం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కార్యాలయ అధికారులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మీ కోసం కార్యక్రమంలో జిల్లా ప్రజల నుండి వివిధ సమస్యలకు సంబంధించిన అర్జీలు స్వీకరించబడతాయన్నారు. సదరు కార్యక్రమం ఒంగోలులోని స్పందన హాలు, కలెక్టర్ ఆఫీసు నందు నిర్వహించబడతాయన్నారు. జిల్లా అధికారులందరూ సదరు కార్యక్రమానికి సోమవారం ఉదయం 10 గంటలకు హాజరు కావాలని ఆ ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# విద్యుత్‌శాఖ మంత్రికి అభినందనలు

మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచు గరటయ్య, యర్రగొండపాలెం ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య, టిడిపి ప్రకాశం జిల్లా అధ్యక్షులు డాక్టర్ నూకసాని బాలాజీ, తదితరులు ఉన్నారు.











# ఒంగోలు అభివృద్ధి ప్రదాత





















ఆర్టీసి బస్టాండ్ సెంటర్ వద్ద టిడిపి నాయకులు భారీ గజమాలను వేశారు. స్థానిక అద్దంకి బస్టాండ్ సెంటర్ వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి, బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్ వద్ద ఉన్న దివంగత దామచర్ల ఆంజనేయులు విగ్రహానికి ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు కి పూలమాలలు వేశారు. శ్రీ బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు సతీమణి నాగసత్యలత, కుమార్తెలు అనీషా లక్ష్మి, తనీషా లక్ష్మి, టిడిపి నాయకులు మంత్రి శ్రీనివాసరావు, వైవి సుబ్బారావు, శింగరాజు రాంబాబు, వై శశికాంత్ భూషణ్, కామేపల్లి శ్రీనివాసరావు, మండవ మురళీకృష్ణ, గుమ్మళ్ళ సుబ్బారావు, బండారు మదన్, గోనుగుంట్ల శేషారావు, సోమినేని రవీంద్ర, ప్రత్తిపాటి రమణయ్య, కొఠారి నాగేశ్వరరావు, 29వ డివిజన్ అధ్యక్షులు పెద్దిశెట్టి చంద్ర, మహిళా నాయకురాళ్ళు రావుల పద్మజ, టి అరుణ, ఆర్ల వెంకటరతం, పెద్దిశెట్టి వరలక్ష్మి, నాళం నరసమ్మ, బిరం అరుణరెడ్డి, ఉప్పలపాటి నాగేంద్రం, బోను దుర్గ, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల నిర్మూలన పై అవగాహన





(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 22)

మాదకద్రవ్యాల నిర్మూలన పై ప్రతి ఒక్కరూ అవగాహన కల్గి ఉండాలని పొదిలి సర్కిల్ ఇన్స్‌పెక్టర్ మల్లిఖార్జున, ఎస్ఐ జి కోటయ్యలు తెలిపారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా యువత డ్రగ్స్ కి ఎలా బానిసలు అవుతున్నారు, దానికి ఎలా దూరంగా ఉండాలి లేదా ఎవరైనా వ్యక్తులు దానికి బానిసలు అయినట్లయితే వారిని ఏ విధంగా మార్చాలి, డ్రగ్స్ ను నియంత్రించడానికి అవి విక్రయించే వారి యొక్క సమాచారాన్ని ఎలా ఇవ్వాలి అని విద్యార్థినీ, విద్యార్థులకు తెలియజేశారు. అదే విధంగా ప్రతి ఒక్క విద్యార్థినీ, విద్యార్థులు వారి ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని మంచి లక్ష్యాలను నిర్దేశించుకుని సక్రమమైన మార్గంలో నడుచుకోవాలని చెడు నడత కలిగిన వారికి దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్స్‌పాల్ తారా వాణి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థినీ, విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## బేల్దారి మేస్త్రి అకాలమరణం

### కుటుంబానికి రూ.12 వేలు ఆర్థిక సాయం చేసిన యూనియన్ నాయకులు




(షణ్ముఖ వెలుగు, మద్దిపూడి, జూన్ 22)

మండల కేంద్రమైన మద్దిపూడి మాదిగపల్లెలో బేలుదారి మేస్త్రి మన్నేపల్లి ప్రేమ్ కుమార్ (30) అకాల మరణం చెందారు. తోటి తాపీ మేస్త్రులు కొందరు మానవత్వం చాటుకొని శనివారం అంత్యక్రియల కార్యక్రమంలో పాల్గొని మేము సైతం అంటూ క్రైస్తవ సిద్ధాంతముతో పెట్టిలో పెట్టిన మృతదేహాన్ని అందరూ మోసుకుంటూ మేళ తాళాలతో ఊరేగింపుగా స్మశాన వాటిక వరకు తీసుకువెళ్లారు, ఈసంఘటన అందర్నీ ఆకట్టుకుందియ అంతేకాకుండా మృతిచెందిన మన్నేపల్లి ప్రేమ్ కుమార్ కుటుంబానికి కల్వరి భావన నిర్మాణ తాపీ మేస్త్రుల యూనియన్ నాయకులు కొందరు ఆయన భార్యకు రూ.12 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గురిజాల రాజు, కొండ్రు యిర్మియ, మండల తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు గురిజాల పోలయ్య, జిల్లా మాదిగ జర్నలిస్టు ఫారం అధ్యక్షుడు గురిజాల బాబురావు మాదిగ, గురిజాల సురేష్, దాసరి శ్రీను, గురిజాల ప్రసాద్, గురిజాల సీమోను, గురిజాల నాగేష్, చిన్నయ్య, సంఘ కాపరి కరాటపు చిట్టిబాబు, గ్రామస్తులు, బంధువులు, తదితరులు పాల్గొన్నారు.

## పదవులకు రాజీనామా చేసిన బొట్ల



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 22)

ఆంధ్రప్రదేశ్ గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార సమాఖ్య లిమిటెడ్ గుంటూరు బోర్డు సభ్యత్వంకు, జిల్లా గొర్రెల పెంపకం దారుల సహకార యునియన్ అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తూ బొట్ల రామారావు తన రాజీనామా పత్రాన్ని గుంటూరు అధికారులకు శనివారం అందజేశారు.

# ఎవరు భయపడొద్దు

### నష్టం వచ్చినా కష్టం వచ్చినా నేను ఆదుకుంటాను
### ఇలాంటి సంస్కృతి నేనెప్పుడూ చూడలేదు
### కుటుంబ విలువలు తెలిసిన సంస్కారవంతుడిని
### మరొక కుటుంబాన్ని ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేయను
### రూరల్ వైసీపీ ఇన్చార్జి ఆదాల



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జూన్ 22)

వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఎవరూ భయపడవద్దని, నష్టం వచ్చినా, కష్టం వచ్చినా తాను ఆదుకుంటానని వైసీపీ నెల్లూరు రూరల్ ఇన్‌ఛార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శనివారం నెల్లూరు రూరల్ వైసీపీ కార్యాలయంలో జరిగిన పలు డివిజన్ల కార్పొరేటర్లు, నాయకులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సానుభూతిపరుల ఆత్మీయ సమావేశంలో నెల్లూరు రూరల్ వైసీపీ ఇన్‌ఛార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, మేరిగ మురళీధర్, తాజా మాజీ ఎమ్మెల్యేలు కాకాని గోవర్ధన్‌రెడ్డి, రామ్‌రెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి, మేకపాటి విక్రమ్‌రెడ్డి, ఉదయగిరి వైసీపీ ఇన్చార్జ్ మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, నెల్లూరు నగర వైసీపీ ఇన్చార్జ్ మహమ్మద్ ఖలీల్ అహ్మద్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యకర్తలు నాయకులను ఉద్దేశించి మాట్లాడారు. నాయకులు అందరూ ఏకవచనంతో ఎవరు భయపడవద్దు, ఆందోళనపడవద్దు, రాష్ట్ర పార్టీ అధినాయకత్వం, జిల్లా పార్టీ నాయకత్వం అన్నివేళలా అందుబాటులో ఉండి అండగా ఉంటుందని సంయుక్తంగా సమిష్టిగా భరోసా కల్పించారు. తమ రాజకీయ జీవితంలో ప్రశాంతతకు స్నేహానికి మారుపేరైన నెల్లూరు జిల్లాలో ఇటువంటి హింసాత్మకమైన సంఘటనలు సంస్కృతి ఎన్నడూ చూడలేదని ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న నాయకులందరూ వ్యాఖ్యానించారు. ఎన్నికలలో ఓటమి, విజయాలు అనేటివి సర్వసాధారణమని కానీ 2024 ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజా తీర్పును మనస్ఫూర్తిగా గౌరవించిందని ఈ సందర్భంగా ముఖ్య నాయకులు తెలిపారు. అయితే ఎన్నికల ఫలితాలు వచ్చిన రోజు నుండి నేటి వరకు అధికార తెలుగుదేశం పార్టీ నాయకులు వారి ఇష్టమొచ్చినట్లు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు సానుభూతిపరులపై యద్దేచ్ఛగా దాడులుచేయడం ఆస్తు ధ్వంసం చేయడం భయాందోళనకు గురిచేయడం వంటి దుర్మార్గపు హింసాత్మకమైన సంఘటనలకు పాల్పడడం నీచమైన సంస్కృతి అని ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న నేతలందరు ముక్తకంఠంతో ఖండించారు. ఏదేమైనా కార్యకర్తలకు భరోసా కల్పించేందుకు, అన్ని విధాల అండగా ఉండేందుకు, ఎటువంటి కష్టం ఇబ్బంది వచ్చినా ఏ సమయంలో అయినా అందరం అందుబాటులోకి రావడం



జరుగుతుందని నాయకులు భరోసా కల్పించారు నెల్లూరు రూరల్ నియోజకవర్గం లోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తల ఆత్మీయ సమావేశానికి అధ్యక్షత వహించిన మాజీ మంత్రివర్యులు, రూరల్ వైసీపీ ఇన్చార్జ్ ఆదాల ప్రభాకర్ రెడ్డి కార్యకర్తలు ఉద్దేశించి మాట్లాడుతూ తన రాజకీయ జీవితంలో ఏనాడు కూడా ఎవరికి ఎటువంటి చిన్న హాని కూడా తలపెట్టలేదని, కుటుంబ విలువల తెలిసిన వ్యక్తిని, మరొక కుటుంబాన్ని ఇబ్బంది పెట్టే కార్యక్రమాన్ని ఏనాడు ఆలోచన చేయలేదన్నారు. ఎన్నికల అనంతరం కూడా దురుద్దేశంతో కావాలనే తన పైన బురదచల్లాలని కొందరిని వారివారి వ్యాపారాల పైన దెబ్బకొట్టి తనను తిట్టించే కార్యక్రమాలను చేపడుతున్నారని ఇటువంటి సంస్కృతి మంచిది కాదని రూరల్ వైసీపీ ఇన్చార్జ్ ఆదాల ప్రభాకర్ రెడ్డి చెప్పారు. నెల్లూరు నియోజకవర్గంలోని ఏ కార్యకర్తకు నష్టం వచ్చిన, కష్టం వచ్చినా అన్నివిధాల ఆదుకునేందుకు తాను సిద్ధంగా ఉన్నానని, కార్యకర్తలకు అన్నివేళల అందుబాటులో ఉంటానని మాజీమంత్రి ఆదాల ప్రభాకర్ రెడ్డి స్పష్టం చేశారు. కార్యకర్తలను ఆదుకునేందుకు జిల్లా పార్టీ కార్యాలయంలో ప్రత్యేక బృందం ఏర్పాటు చేయడంతో పాటు, ప్రత్యేక లీగల్ సెల్ ను ఏర్పాటు చేసి ఎవరికి ఏ ఇబ్బంది వచ్చినా ప్రైవేటు కేసులు వేసేందుకు సిద్ధమవుతున్నామని రూరల్ వైసిపి ఇన్చార్జి ఆదాల ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. ఆత్మీయ సమావేశానికి విచ్చేసిన వందలాది మంది కార్యకర్తలతో ఆదాల ప్రభాకర్ రెడ్డి క్యాంపు కార్యాలయం కిక్కిరిసిపోయింది. ముఖ్య నాయకులు అందరు ఒకే వేదిక పైకి వచ్చి కార్యకర్తలకు అండగా ఉంటామని ఐక్యత రాగంతో ప్రకటించడంపై వైఎస్ఆర్సిపి కార్యకర్తలు, నాయకులలో నూతన ఉత్తేజం వెల్లువెరిసింది. ఈ సమావేశంలో విజయ డైరీ చైర్మన్ కొండ్రేడ్డి రంగారెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు మలిరెడ్డి కోటారెడ్డి, స్వర్ణ వెంకయ్య, పేర్నాటి కోటేశ్వర్ రెడ్డి, సిహెచ్ హరిబాబు యాదవ్, యేసు నాయుడు, బద్దిపూడి రవీంద్ర, పాశం శ్రీనివాస్, మల్లు సుధాకర్ రెడ్డి, లేబూరు పరమేశ్వర రెడ్డి, మల్లి నిర్మల, కార్పొరేటర్లు బొబ్బల శ్రీనివాస్ యాదవ్, మూలే విజయభాస్కర్ రెడ్డి, షేక్ ఫమీద, మండల పార్టీ అధ్యక్షులు పుచ్చలపల్లి రాంప్రసాద్ రెడ్డి, నాయకులు మంగళపూడి శ్రీకాంత్ రెడ్డి, పాలకీర్తి రవికుమార్, కల్లూరు లక్ష్మిరెడ్డి, షాలిని, అనితారెడ్డి, రజిని, వైస్సార్సీపీ కాంగ్రెస్ పార్టీ ఆయా డివిజన్ల ఇన్చార్జులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నెల్లూరు రూరల్ నియోజకవర్గం వైసిపి ముఖ్య నాయకులు, కార్యకర్తలు, వైఎస్ఆర్సిపి అభిమానులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## 20 ఏళ్ళ తర్వాత సర్వేపల్లిలో విధ్వంసాలు మొదలయ్యాయి

### మీడియా సమావేశంలో మాజీ మంత్రి కాకాణి



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జూన్ 22)

20 ఏళ్ళ తర్వాత సర్వేపల్లిలో విధ్వంసాలు మొదలయ్యాయని శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో సర్వేపల్లి నియోజకవర్గంలో తెలుగుదేశం మూకలు చేసిన విధ్వసంతో నష్టపోయిన వైయస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అధికారంలోకి వచ్చిన అతి కొద్ది కాలంలోనే వై.యస్.ఆర్.కాంగ్రెస్ పార్టీకి సంబంధించినటువంటి నాయకులు మీద, కార్యకర్తల మీద, సానుభూతిపరుల మీద దాడులు ప్రారంభమయ్యాయన్నారు. వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, సానుభూతిపరులపై తీవ్రమైనటువంటి దాడులను కొనసాగిస్తూ, విధ్వంసం సృష్టిస్తూ, ఆస్తులను హరిస్తూ అన్ని రకాల వాళ్లని మానసికంగా, శారీరకంగా ఇబ్బంది పెట్టేటువంటి పరిస్థితులు తీసుకొని వస్తున్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో తోటపల్లి గూడూరు మండలానికి సంబంధించి కోడూరు గ్రామంలో ఆక్వా రైతు కావలి రెడ్డి రంగారెడ్డికి సంబంధించినటువంటి దాదాపు 50 లక్షల రూపాయల విలువచేసేటువంటి పనిముట్లను తగులబెట్టారన్నారు. పోలీసులకి ఫిర్యాదు చేసినా కేసులో ఎటువంటి పురోగతి లేదన్నారు. నష్టపోయిన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేస్తే, బాధితుల మీద హత్య ప్రయత్నం కేసులు నమోదు చేస్తునటువంటి పరిస్థితి రాష్ట్రం మొత్తం నెలకొందన్నారు. రైతులకు సంబంధించి దారుణంగా ఆస్తులను ధ్వంసం చేసి, వాళ్ళని ఆర్థికంగా నష్టపరచాలనేటువంటి ఆలోచనతో తెలుగుదేశం ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ప్రైవేట్ ఆస్తులతో పాటు, ప్రభుత్వం ఆస్తులకు కూడా ఎక్కడ భద్రత లేకుండా పోయిందన్నారు. కోడూరు గ్రామపంచాయతీకి సంబంధించినటువంటి ట్రాక్టర్ కూడా తగలబెట్టడం జరిగిందన్నారు. రైతులకు సంబంధించినటువంటి ఆస్తులను, ప్రభుత్వ ఆస్తులను తగలబెట్టడంతోపాటు, ఆక్వా పంట సాగు చేసుకునేటువంటి రైతుల పొలాల్లోకి వెళ్లి విషం కలిపి రైతులకు నష్టం కలిగిస్తున్నారని తెలిపారు. ఇటువంటి సంస్కృతిని ఎన్నడూ ఎక్కడా చూసినటువంటి పరిస్థితి లేదన్నారు. వెంకటాచలం మండలంలో కంటేపల్లి గ్రామంలో వెంకటేశ్వర్లుకు సంబంధించిన రేకుల షెడ్డును ప్రయివేట్ వ్యక్తులు మిషన్ తీసుకొని వెళ్లి కూల్చడం జరిగిందన్నారు. కుటీర పరిశ్రమగా ఇటుకల తయారీ అన్ని అనుమతులతో నిర్వహిస్తుంటే ధికారుల ప్రమేయం లేకుండా ప్రయివేట్ వ్యక్తులు కూల్చడం దారుణమన్నారు. ఒక వ్యక్తికి సంబంధించినటువంటి ఆస్తిని తొలగించేటువంటి హక్కు తెలుగుదేశంపార్టీ వారికి ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. ఆంధ్ర రాష్ట్రంలో తెలుగుదేశం నాయకులు ఒక దుష్ట సాంప్రదాయాన్ని తీసుకొచ్చేటువంటి పరిస్థితి దాపురించిందన్నారు. చంద్రబాబు నాయుడు, తెలుగుదేశం ప్రభుత్వం ఒక కొత్త విధానాన్ని, కొత్త పోకడలను తీసుకొని వస్తున్నారన్నారు.




## బడి బయట పిల్లలు ఉండకూడదు



(షణ్ముఖ వెలుగు, హనుమంతునిపాడు, జూన్ 22)

మండలంలో శనివారం నుంచి నేను బడికి పోతా కార్యక్రమం మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో జరిగింది. జూలై 12 నాటికి ఏ గ్రామంలో కూడా బడి బయట పిల్లలు ఉండకూడదని, అందరినీ బడిలో చేర్పించాలని తెలిపారు. ఒక ప్లాన్ ఆఫ్ యాక్షన్‌తో అందరూ ముందుకు పోయి నేను బడికి పోతా అనే కార్యక్రమాన్ని విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి వారిని తగిన విధంగా ప్రోత్సహించి తల్లిదండ్రులకు ప్రభుత్వం కల్పిస్తున్నటువంటి సదుపాయాలను మధ్యాహ్న భోజన పథకం ఉచితంగా విద్యార్థులకు పుస్తకాలు యూనిఫామ్‌లు కల్పిస్తుందని చెప్పారు. వారు బడికి రానటువంటి పిల్లల కారణాలను తెలుసుకొని బడికి పంపే విధంగా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు పెద్దిరాజు, రమణయ్య, తాసిల్దార్ కొంగలవీటి కిషోర్ కుమార్‌రెడ్డి, ఏపిఎం, కేజీబీవీ అధ్యాపకులు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



# వాసవి క్లబ్ ఆధ్వర్యంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి

## గునుపూడి భాస్కర్‌కి ఘన సత్కారం

## తన నమ్మకాన్ని కాపాడిని ప్రతి ఆర్యవైశ్యుడికి రుణపడి ఉంటా









**(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 22)**

పట్టణంలోని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్ నివాసంలో శనివారం వాసవిక్లబ్ సభ్యులు గునుపూడి భాస్కర్, మాధవి దంపతులకు ఘన సత్కారం నిర్వహించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఆర్యవైశ్యులు, ఇతర సామాజికవర్గాలను ఒకే దారిలో నడిపించి ఎమ్మెల్యేగా కందుల నారాయణరెడ్డి, ఎంపిగా మాగుంట శ్రీనివాసులరెడ్డిని గెలిపించడంలో కీలక పాత్ర పోషించిన గునుపూడి భాస్కర్‌ని సన్మానించారు. వాసవి క్లబ్స్ అందరూ అభినందనలు తెలియచేశారు. ఇంకా మంచి వున్నత పదవులు ఆశించాలని ఆకాక్షించారు. గత 50 ఏళ్ల క్రితం ఆర్యవైశ్యులు గ్రామ పంచాయితీ సర్పంచ్‌గా గెలిచి గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. అదే విధంగా అన్ని సామాజికవర్గాల ప్రజల అభిమానాన్ని చూరగొన్న మిమ్మల్ని మున్సిపల్ చైర్మన్‌గా చూడాలని వుంది అని ఆర్యవైశ్యులు తమ కోరికలను తెలిపి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్ మాట్లాడుతూ మీ అందరూ తన మాటకి విలువిచ్చి కందుల నారాయణరెడ్డి, మాగుంట శ్రీనివాసులరెడ్డి గెలుపులో భాగస్వాములు అయ్యారన్నారు. అందుకు మీ అందరికీ మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేస్తూ మీ అందరికీ రుణపడి ఉంటానన్నారు. అలాగే అన్ని వర్గాల ప్రజలు తన పట్ల అభిమానంగా వుంటారని, తాను కూడా అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ అన్ని వర్గాల్లో మంచి పేరు తెచ్చుకున్నానని తెలిపారు. గెలుపు కి సహకరించిన అందరికీ కూడా తన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

తన తల్లితండ్రులను ఆదర్శంగా తీసుకొని నీతిగా ఉంటూ ఎన్నో ఆటు పోట్లను సైతం ఎదుర్కొని ఎన్ని ప్రలోభాలు పెట్టినా, భయపెట్టాలని చూసిన పార్టీ మారకుండా తన సేవలు పార్టీకి అందిస్తున్నానంటే అది కేవలం తన అభిమానులు, తన శ్రేయోభిలాషులు తనకు అండగా ఉండడమేనన్నారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్స్, రీజన్, జిల్లా, రాష్ట్ర నాయకులు సొమిశెట్టి శ్రీదేవి, సోమిశెట్టి చిరంజీవి, మేడా నరసింహారావు, సాధు ప్రవీణ్, రావూరి ప్రసాద్, పమిడిమర్రి కృష్ణ, మునగ సత్యం, పందిటి మురళి, ఒగ్గు వెంకటరామయ్య, సాధు చంద్రశేఖర్, యాదాల సుబ్బారావు, పందిటి వరలక్ష్మి, పులిపాటి స్రవంతి, తాత రాము, రావూరి సుబ్బారాయుడు, సోమిసెట్టి శ్రీను, పేరం లక్ష్మి నారాయణ, సామి రాజా, తదితరులు పాల్గొన్నారు.



# యాజమాన్య పద్ధతులు పాటించి రైతులు అధిక దిగుబడి పొందాలి






**(షణ్ముఖ వెలుగు, అర్ధవీడు, జూన్ 22)**

మండలంలోని అర్ధవీడు రైతు భరోసా కేంద్రం నందు జిల్లా వనరుల కేంద్రం ఒంగోలు వారు రైతులకు శనివారం శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమం ఆత్మ 2024-25 ఫార్మర్ ఓరియంటెడ్ యాక్టివిటీ కింద ఖరీఫ్ సీజన్లో సాగు చేసే ప్రధాన పంటలలో అధిక దిగుబడి సాధించడంలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి వాటిని అధిగమించుటకు రైతులు చేపట్టవలసిన మేలైన యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు అవగాహన కల్పించడం కొరకు ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. సహాయ వ్యవసాయ సంచాలకులు డి బాలాజీ నాయక్ మాట్లాడుతూ వ్యవసాయ శాఖ నందు 50 శాతం రాయితీ పై పచ్చి రొట్టె విత్తనాలు సబ్సిడీపై ఇస్తున్నట్లు తెలిపారు. పచ్చిరొట్ట విత్తనాలు సాగు చేసి పూతకు వచ్చినప్పుడు భూమిలో కలియదున్ని నట్లయితే నేలలో సేంద్రీయ కర్బనం శాతం పెరిగి నేల సారవంతం అవుతుందని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి షేక్ మహమ్మద్ మాట్లాడుతూ అర్ధవీడు మండలంలో ఖరీఫ్ సీజన్లో సాగు చేసే ప్రధాన పంటలు మరియు వాటి సాగులోని సమస్యలను గురించి వివరించడం జరిగింది. అనంతరం జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి ఏ. శైలజ రాణి మాట్లాడుతూ వ్యవసాయంలో జీవన ఎరువులు మరియు సేంద్రియ ఎరువుల యొక్క ప్రాముఖ్యత వాటి ఉపయోగాలు మరియు ఏ రకంగా వాడుకోవాలని రైతులకు వివరించడం జరిగింది. అనంతరం ఉద్యాన శాఖ అధికారి డి శ్వేత మాట్లాడుతూ ఉద్యాన శాఖ పథకాలను వివరించారు, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి వి. వెంకట శేషమ్మ ప్రధాన పంటలలో ఆశించే పురుగులు తెగుళ్లు, వాటి నివారణ మేలైన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు అలాగే రైతులు వారు సాగు చేసే పంటలపై అడిగిన సందేహాలకు కూడా సమాధానాలు తెలియజేశారు. ప్రధాన పంటలలో చేపట్టవలసిన మేలైన యాజమాన్య పద్ధతులను గురించిన కరదీపికను రైతులకు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రైతు భరోసా కేంద్రం సిబ్బంది మరియు మండలంలోని రైతులు పాల్గొనడం జరిగింది.

# పేద విద్యార్థులకు సూర్య శ్రీ ట్రస్ట్ అండగా ఉంటుంది

మండవ మురళీకృష్ణ



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 22)**

సూర్య శ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ సెక్రెటరీ షేక్ సర్దార్ భాష ఆధ్వర్యంలో పేద విద్యార్థి అబ్దుల్లా ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్ చదువుకు అవసరమైన పుస్తకాలు నోట్ బుక్స్, సైకిల్ శనివారం ట్రస్టు కార్యాలయంలో సూర్య శ్రీ ట్రస్ట్ వ్యవస్థాపకులు మండవ మురళీకృష్ణ ద్వారా అందజేయడమైనది. మురళీకృష్ణ మాట్లాడుతూ బాగా చదువుతున్న పేద విద్యార్థులకు సూర్య శ్రీ ట్రస్ట్ ఆర్థికంగా అండగా ఉంటుందని తెలిపారు. ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ళ సుబ్బారావు మాట్లాడుతూ నరసరావుపేట చెందిన పేద విద్యార్థి అబ్దుల్లా తండ్రి వాచ్మెన్‌గా తల్లి ఇండ్లలో పాచి పని చేస్తుంది. సూర్య శ్రీ ట్రస్ట్ చేస్తున్న సేవా కార్యక్రమాలు తెలుసుకొని వచ్చి సహాయం చెయ్యమని కూరగా ట్రస్ట్ సెక్రెటరీ సర్దార్ స్పందించి ప్రవాస భారతీయుడు శ్రీకాంత్ చౌదరి, సతీష్, సహకారంతో అందించారు. చదువుల్లో బాగా రాణిస్తున్న అబ్దుల్లా పదో క్లాసులో 537 మార్కులు సాధించారు. పేద కుటుంబానికి చెందిన అబ్దుల్లాకి ఇంటర్ ఫస్టియర్ పుస్తకాలు నోట్ బుక్స్ , మరియు కాలేజీ దూరం వల్ల రేంజర్ సైకిల్ దాతల సహకారంతో అందించి మానవత్వం చాటారు అని తెలిపారు. ఈ సేవ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్ పర్సన్ సయ్యద్ షహనాజ్, సుబ్బారావు, జనసేవ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

# నేను బడికి పోతా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



**(షణ్ముఖ వెలుగు, బేస్తవారిపేట, జూన్ 22)**

మండలంలోని నేకునాంబాద్ మండలపరిషత్ ప్రాథమిక పాఠశాలలో నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా శనివారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఈఓ 1 కాశయ్య హాజరై ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఉపాధ్యాయులు, గ్రామస్థులు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జివి కృష్ణయ్య, ఉపాధ్యాయులు భాగ్యలక్ష్మి, కృష్ణమూర్తి, గ్రామస్థులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడుకి తీవ్ర గాయాలు



**(షణ్ముఖ వెలుగు, బేస్తవారిపేట, జూన్ 22)**

కొమరోలు మండలం ఎడమకల్లు గ్రామ సమీపంలోని అమరావతి కడప రాష్ట్ర రహదారిపై శనివారం లారీ ద్విచక్ర వాహనం ఢీకొన్న సంఘటన చోటుచేసుకుంది. ఈ సంఘటనలో ద్విచక్ర వాహనదారుడు కాలే గురువయ్య తీవ్రంగా గాయపడ్డాడు. తీవ్రంగా గాయపడ్డ ద్విచక్ర వాహనదారుడిని స్థానికులు గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. క్షతగాత్రుడు కొమరోలు మండలం బొడ్డువానిపల్లి గ్రామానికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. రోడ్డు ప్రమాదం జరిగిన ప్రాంతంలోనే గతంలో కూడా అధిక మొత్తంలో రోడ్డు ప్రమాదాలు జరిగాయని రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

# దేవకి సురేష్‌కు నివాళులర్పించిన వైసీపీ ఇన్‌ఛార్జి దద్దాల





**(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జూన్ 22)**
వార్డు కౌన్సిలర్ పెద్ద కుమారుడు దేవకి సురేష్ పార్థివ దేహానికి నివాళి అర్పించిన వైసిపి ఇన్‌ఛార్జి దద్దాల నారాయణ యాదవ్ కనిగిరి మున్సిపల్ వార్డు కౌన్సిలర్ దేవకి సత్యవతి పెద్ద కుమారుడు దేవకి సురేష్ పార్థివ దేహానికి కనిగిరి వైసీపీ ఇన్‌ఛార్జి దద్దాల నారాయణ యాదవ్ పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను ఓదార్చి వారికి ప్రధాన సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గఫార్ మున్సిపల్ వైస్ చైర్మన్ మాణిక్యాలరావు, కనిగిరి జెడ్పిటిసి కస్తూరిరెడ్డి, వార్డ్ కౌన్సిలర్లు దేవకి రాజు, శ్రీరామ్, సతీష్, దాసరి మురళి, మున్సిపల్ కోఆప్షన్ చింతం శ్రీను, జడ్పిటిసి ఓకే రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు బొర్రారెడ్డి, ఎంపీటీసీ కొండారెడ్డి, వైసీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తలకు అండగా ఉంటా

**వైసీపీ ఇంచార్జి దద్దాల**



**(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జూన్ 22)**
వైసిపి కార్యకర్తలకు అండగా ఉంటానని కనిగిరి వైసీపీ ఇన్‌ఛార్జి దద్దాల నారాయణ యాదవ్ అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని ఎవరు అధైర్య పడద్దని అన్నారు. అలానే ప్రతి మండలంలోని నాయకులందరూ కార్యకర్తలందరికీ అందుబాటులో ఉంటారని, ఏవైనా చిన్న చిన్న సమస్యలు ఉంటే వారు నాయకులను సంప్రదించాలన్నారు. ఈ సందర్భంగా వెలిగండ్ల మండలం జంగంనర్సాయిపల్లి పల్లెకు చెందిన వారు ఇటీవల జరిగిన కేసులో సంబంధం లేని వ్యక్తులను కేవలం వైసీపీ సానుభూతిపరులని కేసులో ఇరికించే ప్రయత్నం చేస్తున్నారని ఇన్‌ఛార్జి దాద్దాల నారాయణ యాదవ్‌కు తెలిపారు. అక్రమ కేసులకు ఎవరూ భయపడవద్దని అధికారులతో మాట్లాడతానని వారికి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కనిగిరి జడ్పిటిసి కస్తూరిరెడ్డి, పామూరు మండల సీనియర్ నాయకులు ఒమేగా రామిరెడ్డి, గట్ల విజయభాస్కర్‌రెడ్డి, ఎస్సీ నాయకులు కటికల వెంకటరత్నం, నాదరెడ్డి మాలకొండరెడ్డి, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధుల పట్ల అధికారులను అప్రమత్తం చేసిన ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి



**(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 22)**
మార్కాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆదేశాల మేరకు పట్టణ టీడీపీ అధ్యక్షులు ముల్లా ఖుద్దుస్ చొరవతో సీజనల్ వ్యాధుల పట్ల, పరిశుభ్రత పట్ల నగరపంచాయతీ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, శానిటరీ ఇన్స్పెక్టర్ మారుతీరావు చర్యలు చేపట్టారు. ప్రతి రోజు పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక

## పారిశుధ్యంపై చర్యలు తీసుకున్న నగర పంచాయతీ అధికారులు





నవాబుమిట్టలో పరిశుభ్రత పనులు చేపట్టారు. చెట్లు, కాలువల పై బ్లీచింగ్, స్ప్రేయర్ చేశారు. నవాబుమిట్టలో పనులను టీడీపీ నాయకులు షేక్ మహమ్మద్ యాసిన్, ముల్లా రబ్బానీలు దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ మేస్త్రీ కళ్యాణ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీ వేమిరెడ్డి, జిల్లా ఎమ్మెల్యేలు, రాష్ట్ర మంత్రుల ప్రత్యేక భేటీ

**తాడేపల్లిలోని విపిఆర్ నివాసంలో భేటీ**

**నెల్లూరు జిల్లా సమగ్రాభివృద్ధిపై సుదీర్ఘంగా చర్చ**







**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జూన్ 22)**
ఉమ్మడి నెల్లూరు జిల్లా సమగ్రాభివృద్ధే ధ్యేయంగా నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఉమ్మడి నెల్లూరు జిల్లాల ఎమ్మెల్యేలు, ఇద్దరు రాష్ట్ర మంత్రులు శనివారం తాడేపల్లిలోని విపిఆర్ నివాసంలో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఎంపీ వేమిరెడ్డి తో పాటు రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి నారాయణ, రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో పాటు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్, సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తాడేపల్లిలోని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నివాసంలో శనివారం ప్రత్యేకంగా భేటీ అయి వివిధ అంశాలపై చర్చించారు. ఉమ్మడి జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాల పై వారు చర్చించారు. ఉమ్మడి జిల్లాలో ఎక్కడెక్కడ ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టాలి, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి ఎలా తీసుకువెళ్లాలి అన్న అంశాలపై చర్చించారు. జిల్లాలో ఇద్దరు రాష్ట్ర మంత్రులు ఉన్న నేపథ్యంలో జిల్లా అభివృద్ధిలో వారి సహకారం వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.

# ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక

**జిల్లా కలెక్టర్ హరి నారాయణన్**



**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జూన్ 22)**
ప్రతి సోమవారం "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం హరినారాయణన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 24వ తేదీ సోమవారం నుంచి ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి నెల్లూరు కలెక్టరేట్‌లో తిక్కన ప్రాంగణంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామని చెప్పారు. అలాగే ఆయా శాఖల అధికారులందరూ తమ పరిధిలోని అర్జీలను మీకోసం వెబ్ సైట్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. జిల్లాస్థాయి అధికారులందరూ ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. ప్రజలందరూ తమ సమస్యలపై అర్జీలను అందజేసి ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్ పిలుపునిచ్చారు.



# అసెంబ్లీ సాక్షిగా పొట్టి శ్రీరాములు త్యాగాన్ని కొనియాడిన పవన్ కళ్యాణ్‌కు ధన్యవాదాలు

**ఆర్యవైశ్య మీడియా చైర్మన్ చక్కా కేశవ**

**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జూన్ 22)**
ఆంధ్ర రాష్ట్రం కోసం నిస్వార్థంగా ప్రాణ త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు వారు చేసిన త్యాగాన్ని గూర్చి అసెంబ్లీ సాక్షిగా అమరజీవి త్యాగాన్ని కొనియాడిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు ఆల్ ఇండియా వాసవి సత్ర సముదాయాల మీడియా చైర్మన్ చక్కా వెంకట కేశవరావు ఆర్యవైశ్యుల తరఫున శనివారం ఓ ప్రకటనలో ధన్యవాదాలు తెలియజేశారు. గతంలో కూడా పవన్ కళ్యాణ్ అనేకమార్లు, అనేక సభల్లో అమర జీవి త్యాగాన్ని కొనియాడారు, అదేవిధంగా పవన్ కళ్యాణ్ చదువుకునే సమయంలో తన తోటి ఆర్యవైశ్య మిత్రుడైన నీలిశెట్టి చెంచు రమేష్ తమకు పుస్తకాలను చదువుకోటానికి ఇచ్చేవారని ఆర్యవైశ్యుల సేవాగుణాన్ని కొనియాడారు. ఇవే కాకుండా కూటమి మేనిఫెస్టోలో ఆర్యవైశ్యుల కులదైవమైన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తామని పవన్ కళ్యాణ్ నోటి వెంబడి చెప్పటం ఆర్యవైశ్యులకు ఎంతో సంతోషాన్నిచ్చిందని అన్నారు. ఇదేవిధంగా ఆర్యవైశ్యులకు భరోసా కల్పిస్తూ, వ్యాపార రంగంలో ఆర్యవైశ్యులకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సారథ్యంలో కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని కోరుకుంటూ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు చక్కా వెంకట కేశవరావు ధన్యవాదాలు తెలిపారు.

# 'కల్కి 2898 ఏడీ'లో మలయాళ నటి.. ఎవరీ అన్నా బెన్?



'కల్కి 2898 ఏడీ' విడుదల సమయం సమీపిస్తుండడంతో చిత్రబృందం ప్రచారాన్ని వేగవంతం చేసింది. ఓవైపు వేడుకలు నిర్వహిస్తూ మరోవైపు.. సినిమాలో కీలక పాత్రలు పోషించిన వారి లుక్స్‌ను సోషల్ మీడియా వేదికగా పంచుకుంటోంది. ఈ క్రమంలోనే 'ది లక్కీ రెబల్' అంటూ కైరా క్యారెక్టర్ ప్లే చేసిన నటిని గురువారం సాయంత్రం ప్రత్యేకంగా పరిచయం చేసింది. దీంతో, ఆమె గురించి తెలుసుకునేందుకు చాలామంది నెట్టింట తెగ వెతికేస్తున్నారు. ఇంతకీ ఎవరీ యాక్ట్రెస్..?

**తొలి ప్రయత్నంలోనే విజయం..**

ఈ మలయాళ నటి 'కల్కి'లోని ఓ పాత్రకు ఎంపికైనట్టు చాలా తక్కువమందికి తెలుసు. తాజా పోస్టర్‌తో ఆమె పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఆమె.. అన్నా బెన్ (%జుదీదీబి ఔలిదీ%). కొచ్చికి చెందిన బెన్ అక్కడే 'ఫ్యాషన్ అండ్ అపెరల్ డిజైనింగ్'లో పట్టా పొందారు. తన తండ్రి స్క్రీన్ రైటర్ బెన్నీ పి. నాయరాంబలం. మలయాళంతోపాటు తమిళ్ చిత్ర పరిశ్రమలో పనిచేశారాయన. సినీ నేపథ్య కుటుంబం కావడంతో అన్నాకు బాల్యంలోనే నటనపై ఆసక్తి కలిగింది. చదువు పూర్తయిన అనంతరం.. మలయాళ సినిమా 'కుంబలంగి నైట్స్' (2019)తో తెరంగేట్రం చేశారు. ఉత్తమ పరిచయ నటిగా 'సైమా', 'కేరళ స్టేట్ ఫిల్మ్ అవార్డ్స్' సహా పలు పురస్కారాలు అందుకున్నారు. కమర్షియల్‌గానూ ఆ చిత్రం మంచి విజయాన్ని సాధించింది. ఆ తర్వాత 'హెలెన్', 'కప్పేలా', 'నారదన్', 'నైట్ డ్రైవ్', 'కాపా' వంటి విభిన్న కథా చిత్రాల్లో నటించారు. సోషల్ డ్రామా థ్రిల్లర్‌గా తెరకెక్కి, సక్సెస్ అయిన 'కప్పేలా'.. తెలుగులో 'బుట్టబొమ్మ'గా రీమేక్ అవగా అందులో అనికా సురేంద్రన్ నటించారు.

**కోలీవుడ్, టాలీవుడ్ ఎంట్రీ ఇలా..**

చేసింది తక్కువ సినిమాలే అయినా అన్నింటిలోనూ తనదైన ముద్ర వేసుకొంది ఈ కేరళ అందం. ప్రతీ సినిమాకి ఏదో ఒక అవార్డు సొంతం చేసుకోవడం ఆమెకు అలవాటుగా మారింది. ఈ బ్యూటీ నటించిన 'కొట్టుక్కాళి' చిత్రం 74వ బెర్లిన్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శితమవడం విశేషం. ఆమె నటించిన తొలి తమిళ్ సినిమా ఇదే. ఇప్పుడు 'కల్కి'తో తెలుగు ఆడియన్స్‌ను నేరుగా పలకరించనున్నారు. "దర్శకుడు నాగ్ అశ్విన్ 'కల్కి' గురించి చెప్పగానే ఎంతో ఆనందించా. ఇప్పటివరకూ నేను సైన్స్ ఫిక్షన్ సినిమా చేయలేదు. ఆ డ్రీమ్ 'కల్కి'తో నెరవేరింది. ప్రభాస్ , అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్ వంటి ప్రతిభావంతులతో కలిసి నటించడం ఎప్పటికీ మర్చిపోలేని జ్ఞాపకం. ఇందులో నేను పోషించిన పాత్ర చిన్నదే అయినా ప్రేక్షకులపై మంచి ప్రభావం చూపుతుంది" అని ఓ ఇంటర్వ్యూలో ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ పాన్ ఇండియా మూవీలో దీపికా పదుకొణె, దిశా పటానీ, రాజేంద్ర ప్రసాద్, శోభన ఇతర కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమాని 27న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్న నేపథ్యంలో చిత్ర బృందం ఈ రోజు సాయంత్రం రెండో ట్రైలర్‌ను విడుదల చేయనుంది.

# వ్యూహాల కంటే అనూహ్య పరిణామాలే ఎక్కువ

భవిష్యత్తు గురించి ప్రణాళికలు వేసుకుంటూ... గత అనుభవాల్ని తలచుకుంటూ లేని పోని భారాన్ని తలపై మోయడం కంటే ప్రస్తుతాన్ని ఆస్వాదించడానికే ఇష్టపడతానని చెబుతోంది శ్రీలీల. కొత్త సినిమాలతో మళ్లీ జోరు పెంచిన ఈమె ప్రస్తుతం బిజీ బిజీగా గడుపుతోంది. తొలి అడుగుల్లోనే స్టార్ కథానాయకులతో కలిసి నటించే అవకాశాలు అందుకుంది. విజయవంతమైన ఈ ప్రయాణం వెనక ప్రత్యేకమైన వ్యూహాలేమైనా ఉన్నాయా? అని అడిగితే... "అభిరుచి, ఆసక్తులతోపాటు... నేను నేర్చుకున్న నృత్యమే ఇక్కడివరకూ తీసుకొచ్చాయి తప్ప, కెరీర్ గురించి ప్రత్యేకంగా ప్రణాళికలంటూ ఏమీ లేవు. కుటుంబం నుంచి ప్రోత్సాహం, దర్శకనిర్మాతలకు నాపైన ఉన్న నమ్మకం నా కెరీర్‌పై ప్రభావం చూపించాయి. చిత్రసీమలో మన వ్యూహాల కంటే కూడా, అనూహ్యంగా చోటు చేసుకునే పరిణామాలే ఎక్కువ. అందుకే భవిష్యత్తు గురించి పెద్దగా ఆలోచించను. ఆలోచించినా అది... తలకు భారమే తప్ప పెద్దగా ఫలితం ఉండదు. కొన్నాళ్లుగా చేస్తున్న పాత్రనీ.. నా ముందున్న క్షణాల్నీ ఆస్వాదించడం అలవాటు చేసుకున్నా" అని చెప్పుకొచ్చింది శ్రీలీల.



# 'కాలా'కు అరుదైన గౌరవం



'నేల నీకు అధికారం.. అది మాకు జీవితం" అంటూ తాము జీవించే నేలను దక్కించుకోవడానికి ప్రజల్లో స్ఫూర్తినింపే కరికాలుడుగా 'కాలా' చిత్రంలో కనిపించి మంచి ప్రశంసలు అందుకున్నారు అగ్రకథానాయకుడు రజనీకాంత్. ఆయన ప్రధాన పాత్రలో పా.రంజిత్ తెరకెక్కించిన చిత్రమిది. 2018లో విడుదలైన ఈ యాక్షన్ చిత్రం బాక్సాఫీసు వద్ద ఆశించిన ఫలితాన్ని అందుకోలేదు. అయినా అధికారం కోసం ఉన్నత.. అణగారిన వర్గాల మధ్య జరిగే పోరాటాన్ని చూపించిన విధానం ప్రేక్షకులను మెప్పించింది. తాజాగా ఈ సినిమాకు అరుదైన గౌరవం దక్కింది. బ్రిటిష్‌ఫిల్మ్ ఇనిస్టిట్యూట్ సైట్ అండ్ సౌండ్ మ్యాగజైన్‌లో 21వ శతాబ్దాపు అద్భుతమైన 25 చిత్రాల జాబితాలో 'కాలా'కు స్థానం లభించింది. దీంతో పాటు ఈ మ్యాగజైన్‌లో చోటు దక్కించుకున్న ఏకైక భారతీయ చిత్రమిదే కావడం విశేషం. ప్రపంచ వ్యాప్తంగా అనేక చిత్రాలను విశ్లేషించి విడుదల చేసిన ఈ జాబితాలో 'ఓల్డ్ బాయ్', 'గెట్ అవుట్' లాంటి సినిమాలు ఉన్నాయి. "21వ శతాబ్దం నాలుగు భాగాల్లో ఒక భాగం ముగింపుకు వచ్చిన నేపథ్యంలో మా దగ్గర ఉన్న 25మంది అత్యుత్తమ సినీ విమర్శకుల విశ్లేషణ ఆధారంగా ఈ అరుదైన మైలురాయిని ఆవిష్కరిస్తున్నాం. 2000-2024 మధ్య వచ్చిన సినిమాల్లో అన్ని విభాగాల్లోనూ మంచి ప్రదర్శన కలిగిన 25 చిత్రాలను ఎంపిక చేశాం. ప్రతి సంవత్సరం ఒక్కో సినిమాను తీసుకున్నాం" అని బీఎఫ్ఐ ఓ ప్రకటనలో తెలిపింది.

# రివ్యూ: మహారాజ..

మహారాజ్ఞ్మ నటీనటులు: విజయ్ సేతుపతి, అనురాగ్ కశ్యప్, మమతా మోహన్‌దాస్, నటరాజ్, భారతీరాజా, అభిరామి తదితరుల్ఝ్మ సంగీతం: అజనీశ్ లోకనాథ్ఝ్మ ఎడిటింగ్: ఫిల్లోమిన్ రాజ్ఝ్మ సినిమాటోగ్రఫీ: దినేశ్ పురుషోత్తమన్ఝ్మ నిర్మాత: సుదర్శన్ సుందరమ్, జగదీశ్ పళనిస్వామిఝ్మ రచన, దర్శకత్వం: నిథిలన్ స్వామినాథన్ఝ్మ .

పరిపూర్ణమైన నటుడు విజయ్ సేతుపతి . కథ.. చేసే పాత్రలో వైవిధ్యత కనిపించాలే కానీ హీరో, విలన్, క్యారెక్టర్ ఆర్టిస్ట్ అని లెక్కలేసుకోకుండా బరిలో దిగిపోతారాయన. ఇప్పుడాయన తన 50వ సినిమాగా మహారాజా అనే చిత్రంతో బాక్సాఫీస్ ముందుకొచ్చారు. మరి ఈ మహారాజా కథేంటి? సినీప్రియుల్ని ఏ మేరకు మెప్పించింది?

కథేంటంటే: మహారాజా (విజయ్ సేతుపతి) ఓ బార్బర్. ఒక ప్రమాదంలో భార్యను పోగొట్టుకుంటాడు. అతనికంటూ మిగిలిన ఒకే తోడు కూతురు జ్యోతి. తను ఆ బిడ్డతోనే కలిసి సిటీకి దూరంగా ఉన్న ఓ ఇంట్లో జీవిస్తుంటాడు. మహారాజా ఓరోజు ఒంటి నిండా గాయాలతో పోలీస్‌స్టేషన్ గడప తొక్కుతాడు. ముగ్గురు ఆగంతకులు తన ఇంట్లోకి చొరబడి తనపై దాడి చేశారని.. ఈ క్రమంలోనే తమ బిడ్డ ప్రాణాల్ని కాపాడిన లక్ష్మిని ఎత్తుకెళ్లిపోయారని.. ఎలాగైనా సరే ఆ లక్ష్మిని వెతికి పెట్టమని పోలీసులకు ఫిర్యాదు చేస్తాడు. మరి మహారాజా చెప్పిన ఆ లక్ష్మి ఎవరు? అతని ఫిర్యాదును స్వీకరించడానికి పోలీసులు తొలుత ఎందుకు నిరాకరించారు? అసలు మహారాజపై దాడి చేసిన ముగ్గురు వ్యక్తులెవరు?వాళ్లకు అతనికి ఉన్న విరోధం ఏంటి? అన్నది సినిమా చూసి తెలుసుకోవాలి.

ఎలా ఉందంటే: ఇదొక భిన్నమైన యాక్షన్ థ్రిల్లర్. అంతర్లీనంగా కర్మ సిద్ధాంతం అనే పాయింట్‌తో ముడిపడి ఉంటుంది. నిజానికి ఈ కథను ఓ లైన్‌గా చూసినప్పుడు రొటీన్ రివేంజ్ యాక్షన్ డ్రామాగానే కనిపిస్తుంది. కానీ, దర్శకుడు స్క్రీన్‌ప్లేను ఆద్యంతం ఉత్కంఠభరితంగా నడిపిన తీరు.. విజయ్ సేతుపతి విలక్షణమైన నటన ఈ చిత్రాన్ని ప్రత్యేకంగా నిలబెట్టాయి. ఇది ఓ సింపుల్ పాయింట్‌లా సరదా సరదాగా మొదలై.. ఊహలకు అందని ట్విస్టులతో భావోద్వేగభరితంగా ముగుస్తుంది. ముఖ్యంగా ఇంటర్వెల్, క్లైమాక్స్ ఎపిసోడ్స్‌లో వచ్చే మలుపులు.. సేతుపతి యాక్షన్ హంగామా బాగా ఆకట్టుకుంటాయి.

మహారాజాగా సేతుపతి పాత్రను చాలా సింపుల్‌గా పరిచయం చేసిన దర్శకుడు ఆ తర్వాత అసలు కథలోకి తీసుకెళ్లడానికి చాలా సమయమే తీసుకున్నాడు. ప్రథమార్ధంలో ఎక్కువ భాగం పాత్రల పరిచయాలకే కేటాయించారు. కానీ, దర్శకుడు ప్రతి పాత్రనూ తీర్చిదిద్దుకున్న తీరు వల్ల సినిమా ఎక్కడా బోర్ కొట్టిన ఫీల్ కలగదు. లక్ష్మిని వెతికి పెట్టాలంటూ మహారాజా పోలీస్ స్టేషన్‌లో అడుగు పెట్టడం.. తనపై జరిగిన దాడిని వివరించే తీరు.. లక్ష్మీ ఎవరన్నది తెలిశాక పోలీసులు స్పందించే విధానం.. స్టేషన్‌లో తనకు ఎదురయ్యే అవమానాలు.. అన్నీ ఓవైపు ఆసక్తిరేకెత్తిస్తూనే మరోవైపు నవ్విస్తుంటాయి. మరోవైపు దీనికి సమాంతరంగా ఓ దోపిడీ ముఠా చేసే అకృత్యాలను.. ఇంకోవైపు మహారాజా కూతురు జ్యోతి ఎపిసోడ్‌ను చూపిస్తూ కథలోని ఒక్కో చిక్కుముడిని ఆవిష్కరిస్తూ వెళ్లాడు దర్శకుడు. (%ఖబినీబిజీబిశీబి ష్ట్రలిఖీరిలిగీ రిదీ శిలిజితివీతి%) ఆరంభంలో ఇవన్నీ ఒకదానితో మరొకటి సంబంధం లేని వేరువేరు ఎపిసోడ్స్‌లా కనిపించినా విరామానికి వచ్చే సరికి వీటన్నింటికీ మధ్య ఏదో లింక్ ఉన్నట్లు ప్రేక్షకులకు అర్థమవుతూనే ఉంటుంది. దీనికి తగ్గట్లుగానే ఓ థ్రిల్లింగ్ సీక్వెన్స్‌తో విరామమిచ్చిన తీరు మెప్పిస్తుంది.

ఇక అక్కడి నుంచి అనూహ్యమైన మలుపులతో ద్వితీయార్ధమంతా ఉత్కంఠభరితంగా సాగుతుంది. అసలు మహారాజాకు జరిగిన అన్యాయమేంటి? ఎన్ని అవమానాలు ఎదురైనా లక్ష్మిని వెతికి పెట్టాలంటూ మహారాజా పోలీస్ స్టేషన్ చుట్టూనే ఎందుకు తిరుగుతున్నాడు? వరుస హత్యలకు పాల్పడుతున్న దొంగల ముఠాతో అతనికి ఉన్న విరోధమేంటి? ఈ చిక్కుముడులన్నింటినీ ఒకొక్కటికీ విప్పిన తీరు మెప్పిస్తుంది.

తన బిడ్డ విషయంలో మహారాజాకు జరిగిన నష్టం అందర్నీ షాక్‌కు గురి చేస్తుంది. ప్రతి ఒక్కరి మదిని బరువెక్కిస్తుంది. అతని కడుపుకోత గురించి అర్థమయ్యాక పోలీసులు తన పగలో భాగమైన తీరు చప్పట్లు కొట్టిస్తుంది. ఇక పతాక సన్నివేశాల్లో బాధిత యువతిగా ప్రధాన ప్రతినాయకుడితో జ్యోతి చెప్పే డైలాగ్స్ స్ఫూర్తి రగిలించేలా ఉంటాయి. అలాగే ఆ వ్యక్తికి జ్యోతికి ఉన్న బంధం భావోద్వేగానికి గురి చేస్తుంది. ఈ కథకు ముగింపు పలికిన తీరు ప్రేక్షకులకు మంచి హై ఇస్తుంది.

ఎవరెలా చేశారంటే: మహారాజా పాత్రలో విజయ్ సేతుపతి సహజమైన నటనతో ఆద్యంతం కట్టిపడేశాడు. ఆయన నటనే సినిమాకి ప్రధాన ఆకర్షణ. తన కళ్ల ముందు జరిగిన ప్రమాదంలో భార్యను కోల్పోయినప్పుడు కళ్లతోనే ఆయన పండించే భావోద్వేగాలు.. లక్ష్మిని వెతికి పెట్టాలంటూ అమాయకమైన నటనతో తను పంచే నవ్వులు.. తన కూతురికి అన్యాయం చేసిన వాళ్లను వెంటాడి హతమార్చే తీరు.. ఈ క్రమంలో చేసే మాస్ యాక్షన్ హంగామా.. అన్నీ సేతుపతిలోని నటనా ప్రతిభకు అద్దం పడతాయి. ఆయన కూతురిగా జ్యోతి పాత్రలో సచిన నటన మెప్పిస్తుంది. పతాక సన్నివేశాల్లో ఆమె పలికే సంభాషణలు ప్రేక్షకులతో చప్పట్లు కొట్టిస్తాయి. ప్రధాన ప్రతినాయకుడిగా సెల్వం పాత్రలో అనురాగ్ కశ్యప్ అదరగొట్టాడు. దర్శకుడు ఆ పాత్రను తీర్చిదిద్దుకున్న తీరు.. ఆ పాత్రతో జ్యోతికి ఉన్న బంధం అన్నీ థ్రిల్లింగ్‌గా ఉంటాయి. ఎస్సైగా నట్టి పాత్రకు సినిమాలో మంచి ప్రాధాన్యత ఉంది. ఆ పాత్ర పతాక సన్నివేశాల్లో అందరి మనసుల్ని దోచుకుంటుంది. మమతా మోహన్‌దాస్, భారతీరాజా, మణికందన్, అరుళ్‌దాస్ తదితరుల పాత్రలన్నీ పరిధి మేరకు ఉంటాయి. దర్శకుడు కథను నడిపించిన తీరు మెప్పిస్తుంది. అయితే ఇది ఓ వర్గం ప్రేక్షకులకు గందరగోళంగా అనిపించే అవకాశముంది. ఇక ఈ చిత్రంలో తండ్రీబిడ్డల ఎమోషన్‌ను ఆవిష్కరించిన తీరు.. ఓ సున్నితమైన అంశాన్ని అంతే ప్రభావవంతంగా చెప్పిన విధానం అన్నీ మెప్పిస్తాయి. అజనీష్ లోక్‌నాథ్ సంగీతం సినిమాకి ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంది. ఫిలోమిన్ ఎడిటింగ్ ప్రతిభ.. దినేశ్ ఛాయాగ్రహణం ఆకట్టుకుంటాయి. నిర్మాణ విలువలు ఉన్నతంగా ఉన్నాయి.




On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL 16448. e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com